గడప వద్దకే వైద్య సేవలు

- 14 రకాల వ్యాధులకు చికిత్స
- ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా మెరుగైన సేవలు

గ్రామీణులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్యం ఇంటి వద్దకే అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామానికే వైద్యులు వచ్చి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఇక మంచానికే పరిమితమైన దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షించి చికిత్సలు చేస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలింతలు, గర్భిణులు, చిన్నారులను పరీక్షిస్తున్నారు.


కొచ్చెర్వులో వృద్ధురాలిని ఇంటి వద్దనే పరీక్షిస్తున్న డాక్టర్ విజయ్‌భాస్కర్

డోన్ రూరల్ : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా వైద్యులు పల్లెకు వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొంది, విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరిశీలించి సూచనలు, సలహాలు అందిస్తున్నారు. అత్యవసర కేసుల సిఫారసు, ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు గ్రామంలోనే ఉంటూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు, పాఠశాలలో చిన్నారులకు కూడ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో నాణ్యమైన వైద్యం సేవలు అందిస్తుండటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వైద్య సేవలు ఇలా..

వ్యాధి నిర్ధారణకు సంబంధింత 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులను రోగులకు అందజేస్తారు. డోన్ మండలంలో కొత్తబురుజు, చిన్నమల్కాపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిల్లో మొత్తం నలుగురు వైద్యులు పనిచేస్తున్నారు. వీరు రోజుకొక గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలందిస్తున్నారు. కొత్తబురుజు పీహెచ్‌ఎసీ పరిధిలో 24గ్రామాలు, చిన్నమల్కాపురం పీహెచ్‌సీ పరిధిలో 25 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో ఒక చోట శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులను అక్కడికి పిలిపించి వైద్య పరీక్షలు చేసి మందులు ఇస్తారు. మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలింతలు, గర్భిణులు, చిన్నారులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేస్తారు. సాయంత్రం దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, మంచానికే పరిమితమైన వారు, నడవలేని వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నారు. అలాగే చిన్నారులకు సరైన సమయంలో వ్యాక్సిన్లు వేసేలా స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటింటికీ తిరిగి సేవలందిస్తున్నాం



పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో తిరిగి వైద్య సేవలందిస్తున్నాం. రోజుకొక గ్రామాన్ని సందర్శించి ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నాం. అవసరమైన వారిని ఉన్నత చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలలకు రెఫర్ చేస్తున్నాం. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లోనున్న గర్భిణులు, బాలింతలను, పిల్లలు, పాఠశాలలో విద్యార్థులను కూడా పరీక్షించి తగిన మందులు అందిస్తున్నాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ విజయ్‌బాస్కర్, చిన్నమల్కాపురం పీహెచ్‌సీ

అభినందనీయం



గ్రామానికే వచ్చి వైద్య సేవలు అందిస్తుండటం అభినందనీయం. గతంలో ఎప్పుడూ ఇలాంటి చర్యలు చేపట్టలేదు. ముఖ్యంగా మంచానికే పరిమితమైన వారిని ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలందించి మందులు ఇస్తుండటం హర్షనీయం. ఇప్పటి వరకు రెండుసార్లు గ్రామంలోనే వైద్య పరీక్షలు చేయించుకున్నా.

– డి.ధరణి, ఉడుములపాడు గ్రామం, గర్భిణి

ఉప్పలపాడులో వైద్యశిబిరం


ఉప్పలపాడులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

అవుకు: పేదలకు నాణ్యమైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని చేపట్టిందని వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని విలేజ్ క్లినిక్ వద్ద వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వివిధ రోగాలతో బాధపడుతున్న 130 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేశారు.అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగితెలుసుకుని,రికార్డులను పరిశీలించారు. వైద్యసిబ్బంది ఫర్హానా, ఎల్లమ్మ,, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి

డోన్ రూరల్ : ఉల్లి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్,రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య కోరారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం సీపీఐ శాఖ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువ శాతం ఉల్లి పంట సాగు చేశారని, లక్షల రూపాయలు వెచ్చించి పంట సాగు చేస్తే దిగుబడికి సరైన ధరలేకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పులిశేఖర్, నారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజిలెన్స్ అధికారుల తనిఖీ


ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బనగానపల్లె: ఇటీవల రూ.1.30 కోట్లతో నిర్మించిన స్థానిక ఎంపీడీఓ కార్యాయాలన్ని శుక్రవారం విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ నాగేశ్వరరెడ్డి డీఈఈ మోహన్‌రావు, ఏఈ ప్రభుదాసు పరిశీలించారు. కార్యాలయం లోపలి భాగం, మొత్తం గదుల నిర్మాణాలు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఎంపీడీఓ శివరామయ్య, పీఆర్ ఏఈ రమణ ఉన్నారు.

పల్నాడు జిల్లాకు వెళ్లి పింఛన్ అందజేత


గోరంట్లమ్మ వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ బి.మధుశేఖర్

డోన్ రూరల్: మండలంలోని మల్లెంపల్లి గ్రామానికి చెందిన బి.మధుశేఖర్ అనే వలంటీర్ పల్నాడు జిల్లాలోని గొల్లపల్లి మండలం గండిగనుమల గ్రామానికి వెళ్లి ఇద్దరు లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్ అందజేశారు. బోయపల్లె మాదన్న, గోరంట్లమ్మ పల్నాడు జిల్లాకు వలస వెళ్లారు. దీంతో వలంటీర్ అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

కోవెలకుంట్ల: స్థానిక ఎస్‌ఎల్‌వీటీ సినిమా థియేటర్ ఆవరణలో శుక్రవారం చిరంజీవి అభిమానులు చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది. కర్నూలు జిల్లా చిరంజీవి యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. సంఘం నాయకులు సురేష్‌బాబు, బాలగురప్ప, విక్కీ, జశ్వంత్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి


హుస్సేనాపురంలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీవిద్య

బనగానపల్లెరూరల్: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాలని డోన్ క్లస్టర్ డ్వామా ఏపీడీ శ్రీవిద్య సూచించారు. శుక్రవారం మండలంలోని చెరువుపల్లె, హుస్సేనాపురం,ఎర్రగుడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కూలీల వేతనం రూ.257 కు తగ్గకుండా చూడలని, కూలీలకు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు వేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తయ్యాయని, కూలీలు వసలలు వెళ్లకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఏ శ్వేత,సిబ్బంది ఉన్నారు.

శాస్త్రవేత్తల సేవలు చిరస్మరణీయం


గ్రహంబెల్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: శాస్త్రవేత్తల సేవలు చిరస్మరణీయమని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. టెలిఫోన్ ఆవిష్కర్త అలెగ్జాండర్ గ్రహంబెల్ జయంతిని పురస్కరించుకొని పాతపేట హైస్కూల్లో శుక్రవారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తీగల ద్వారా శబ్ద తరంగాలను పంప గలిగే టెలిఫోన్ ఆవిష్కరణకు దారి తీసిన పరిస్థితుల గురించి వివరించారు. నేడు మనం అనుభవిస్తున్న అనేక సౌకర్యాలు పలువురి శాస్త్రవేత్తల అపారమైన కృషితోనే సాధ్యమైందని చెప్పారు.

రహదారి పనుల పరిశీలన

బేతంచెర్ల: పట్టణ సమీపంలోనున్న అయ్యల చెర్వు నుంచి పట్టణం మీదుగా కస్తూర్బా గురుకుల విద్యాలయం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ నుంచి ప్రారంభించిన పనులను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పరిశీలించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పనులు కొనసాగించాలని కంట్రాక్టర్‌కు ఆయన సూచించారు.

నిజాయితీ, నిబద్ధతగా పనిచేసే వారిని ఎన్నుకోండి


కోర్టు ఆవరణలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్/డోన్ రూరల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిజాయితీ, నిబద్ధతతో సేవ చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఓటర్లను కోరారు. శుక్రవారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ పట్టణంలోని సబ్‌కోర్టు, రెవెన్యూ, ఎంపీడీఓ, పోలీసు కార్యాలయాలతో పాటు దొరపల్లి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, కౌన్సిలర్లు జాకీర్‌హుసేన్, మల్లికార్జునరెడ్డి, దినేష్‌గౌడ్, మహేశ్వరరెడ్డి, నాయకులు భాస్కర్‌నాయుడు, లక్ష్మిరెడ్డి, మంగమూరి గోపాల్, చిరంజీవి,మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామచంద్రుడు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరపున బరిలో ఉన్న వెన్నెపూస రవీంద్రరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలదే అని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెన్నెపూస రవీంద్రరెడ్డి సోదరుడు వెన్నెపూస నరేష్ రెడ్డి మాట్లాడారు.

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. గోర్లగుట్ట, సిమెంట్ నగర్, అంబాపురం, ఆర్ కొత్తపల్లె, బుక్కాపురం గ్రామాల్లో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరక్టర్ మురళీ కృష్ణ, నాయకులు బాబుల్ రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి ప్రచారం చేశారు. పట్టణంలోని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, నాయకులు 1, 7,8 వార్డులో ఓటు అభ్యర్థించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి


కరపత్రాలను అధ్యాపకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ ఉన్నత, బాలికోన్నత, గురుకుల పాఠశాలలు, గాయత్రీ, జ్యోతి విద్యానికేతన్, సెయింట్ జోసఫ్స్, చిదానంద, ప్రగతి, వికాస్ హైస్కూల్‌లో అధ్యాపకులు, ఉపాధ్యాయులకు కరపత్రాలు అందజేసి ఓటు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దిందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే తనయుడు కాటసాని ఓబుళరెడ్డి, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, ఆయా సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, అమడాల బాలమద్దిలేటి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి , ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసనాయక్, దశరథరామిరెడ్డి, గడ్డం వర ప్రసాద రెడ్డి, సుధాకర్, సప్తగిరి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలోని రామతీర్థం, చెరువుపల్లె, బీరవోలు గ్రామాల్లో సచివాలయాల కన్వీనర్లు వడ్డె వెంకటేష్, కాటసాని పుల్లారెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ బలపరచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వారు ఆయా గ్రామాల్లో పాఠశాలలు, ఆర్‌బీకేలు, సచివాలయాలను సందర్శించి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని ఉద్యోగులను కోరారు.

కొలిమిగుండ్ల: పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి కోరారు. శుక్రవారం బెలుం శింగవరం,బెలుం గ్రామాల్లో పట్టభద్రులతో పాటు పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, కంబయ్య,బీగాల వెంకటసుబ్బయ్య, శంకర్‌రెడ్డి,బత్తుల మల్లేష్, సుధాకర్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం


మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ మహమ్మద్‌గౌస్

బనగానపల్లెరూరల్: వన్యప్రాణుల కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ మహమ్మద్‌గౌస్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల జంతు శాస్త్ర శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ రోజురోజుకు అంతరిస్తున్న జంతువులు, వివిధ రకాల మొక్కలను కాపాడుకోవాలని కోరారు. అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి

కోవెలకుంట్ల: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ కేశవరావు అన్నారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులు అంతరిస్తే వాటి నుండి ఉత్పత్తి అయ్యే అనేక ఔషధ మూల పదార్థాలను కోల్పోతామన్నారు. వాటిని సంరక్షిస్తే మానవాళి మనుగడ క్షేమంగా ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శనగ రైతుకు భరోసా


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్ మొదటి పంటగా సాగు చేసిన పప్పుశనగ రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించిందని ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సొదరదిన్నె గ్రామంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్వింటాకు రూ.5,335 మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ క్రాప్ ప్రామాణికంగా గరిష్ఠంగా వంద క్వింటాళ్ల శనగ దిగుబడులను కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించవచ్చని పేర్కొన్నారు. సబ్ డివిజన్‌లోని ఆయా రైతు భరోసా కేంద్రాల్లో విక్రయ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఏఓ నిరంజన్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, డీసీఎంఎస్ ఇన్‌చార్జ్ రసూల్ పాల్గొన్నారు.

జీవాల పెంపకం లాభదాయకం



మేక పిల్లలను అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పేద కుటుంబాలకు జీవాల పెంపకం అన్ని విధాలా లాభదాయకమని పట్టణానికి చెందిన చైల్డ్ ఫండ్ ఇండియా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా తెలిపారు. ఆ సంస్థ దత్తత గ్రామాలైన ముదిగేడు, కమలపురి, వెలగటూరు, బిజనవేముల, అమడాల, కొత్తపేట గ్రామాలకు చెందిన 15 నిరుపేద కుటుంబాలకు శుక్రవారం పొట్టేలు పిల్లలను పంపిణీ చేశారు. ఆయా కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.15 వేల విలువజేసే మేకలు, గొర్రెలు, పొట్టేలు పిల్లలను అందజేశారు. సంస్థ సిబ్బంది మహేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి


బీమా చెక్కు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: అతి తక్కువ ప్రీమియంతో అందిస్తున్న బీమా భద్రతను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్ ఎస్‌కే రసూల్‌బాషా కోరారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులకు శుక్రవారం బీమాకు సంబంధించి రూ. 9లక్షల విలువైన చెక్కును అందజేశారు. తమ బ్యాంక్‌లో అకౌంట్ ఉండి ప్రభుత్వాలు,బ్యాంక్‌లు కలిసి అందిస్తున్న వివిధ రకాల భీమా పథకాలకు ప్రీమియం చెల్లించడంతో బీమా సొమ్ము చెల్లించామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది గోవర్ధన్, పార్థసారధి, జయప్రకాష్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం

కొలిమిగుండ్ల: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ పేర్కొన్నారు. బీజేపీ తీరును నిరసిస్తూ అనంతపురం నుంచి అమరావతి వరకు చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర శుక్రవారం కొలిమిగుండ్ల నుంచి ప్రారంభించి బెలుం వరకు చేపట్టి అవుకు మండలంలోకి ప్రవేశించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తమను మోసం చేస్తుందని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్ద మునెయ్య, నాగన్న, శ్రీనివాసులు, దస్తగిరి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని పడకండ్లలో రాఘవేంద్ర (36)ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. రాఘవేంద్రకు వ్యవసాయంలో అప్పులు కావడంతో ఆ బాధతో మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపానికి లోనై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పై కప్పుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దించే సరికే మృతి చెందాడు. భార్య కోటేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న జడ్జి

డోన్ టౌన్: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ తంగమణి తెలిపారు. శుక్రవారం సాయత్రం పట్టణంలోని బీసీ,ఎస్సీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని బాత్ రూంలు, సౌకర్యాలు, మెనూ ప్రకారం భోజనం, నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో సమావేశమై విద్యను అభ్యసిస్తున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం పది పరీక్షల్లో అధిక మార్కులు తెచ్చుకోవడంపై ప్రముఖ మోటివేటర్, మైండ్ కోచ్ మెమొరీ ట్రైనర్ మాధవస్వామి అవగాహన కల్పించారు. న్యాయవాది మద్దయ్య, వసతి గృహాల అధికారులు, మధు,బాబా ఫకృద్దీన్, కోర్టు సిబ్బంది సరిత ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


గేదెకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న ఏడీఏ మారుతీసకారామ్

బనగానపల్లెరూరల్: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ మారుతిసకారామ్ సూచించారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏడీఏ మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువులు మేత మేయకుండా అనారోగ్యం బారిన పడుతాయన్నారు. దీని వల్ల వాటిలో పాల దిగుబడి సామర్థ్యం తగ్గుతుందని, సకాలంలో ఎదకు రాకుండా ఉండి చూలు నిలువదన్నారు. వ్యాధి సోకిన పశువులు ఎండతాకిడికి తీవ్రంగా ఆయాసపడతాయని లక్షణాలను వివరించారు. ఆయా లక్షణాలు పశువుల్లో కనిపిస్తే రైతులు వెంటనే స్థానిక పశువైద్యులను సంప్రదించాలని చెప్పారు. పశువైద్యులు డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

చౌడేశ్వరీ దేవికి పల్లకీసేవ


అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ప్యాపిలి: మండలంలోని బావిపల్లి గ్రామంలో శుక్రవారం ఈడిగ రాజేశ్వరి అనే మహిళ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. టీవీ చూస్తున్న సమయంలో షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఆమె భయంతో బయటకు పరుగుతీసింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విలువైన సామగ్రి దగ్ధమైంది. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీకి సంబంధించిన వస్తువులు, టీవీ, ఫ్రిడ్జ్, బియ్యం, దుస్తులు ఇతర సామగ్రి మొత్తం కాలిపోయింది. కాగా వీడియోగ్రాఫర్‌గా పనిచేస్తున్న రాజేశ్వరి భర్త సుబ్రహ్మణ్యం కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు.